ఈనాడు
చిత్తూరు

విస్తరణ వ్యయం (అంచనా) రూ.కోట్లు	అదనపు ఆయకట్టు (ఎకరాలు)	నింపనున్న చెరువులు	తాగునీరు
800	37,300	118	5 లక్షల మందికి



పీబీసీ విస్తరణ ఇక చకచకా

హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) మరింత జలకళ సంతరించుకోనుంది. అన్నదాతల సాగు వెతలు తీర్చడంతోపాటు ప్రజల తాగునీటి కష్టాలు ఈ పథకం తీరుస్తోంది. దీని పరిధిలోనే పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కాలువలు జిల్లాలో ఉన్నాయి. ఇదికాకుండా ప్రధాన కాలువపై ఆధారపడి నీవా బ్రాంచి కాలువ ఉంది. ప్రస్తుతం పీబీసీ, కేబీసీ పనులు పూర్తయినా సామర్థ్యం సరిపోక చివరి ఆయకట్టుకు కృష్ణా జలాలు చేర్చడం కష్టతరంగా ఉంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం పీబీసీ విస్తరణ వేగంగా పూర్తిచేయాలని నిర్ణయించింది. ఈనెల 23న జిల్లాలో పర్యటించిన జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు ఈవిషయాన్ని స్పష్టం చేశారు. **- ఈనాడు, చిత్తూరు**


పీబీసీ విస్తరణపై సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

మరో 800 క్యూసెక్కులు ప్రవహించేలా

ప్రస్తుతం పుంగనూరు బ్రాంచ్ కాలువ సామర్థ్యం 380 క్యూసెక్కులు ఉంది. చివరి పాయింట్ అయిన పెద్దపంజాణి మండలం అప్పినపల్లె చెరువు వద్దకు 150- 200 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతోంది. కేబీసీ కింద దాదాపు 110 చెరువులు నింపాలని ప్రణాళిక ఉన్నా సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ఈక్రమంలోనే కాలువను విస్తరించి అదనంగా మరో 800 క్యూసెక్కులు ప్రవహించేందుకు వీలుగా పనులు చేయాలని భావించారు. మొత్తంగా 1,180 క్యూసెక్కులు పారేలా ప్రణాళికలు రూపొందించారు. తద్వారా తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లోని 37,300 ఎకరాలకు నీరందనుంది. 5 లక్షల మందికి తాగునీరు అందించనున్నారు. 118 చెరువులు నింపనున్నారు.

వ్యయ అంచనాలిలా

గత వైకాపా ప్రభుత్వంలో గాలేరు-నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్)- హంద్రీ- నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్)ను అనుసంధానం, పీబీసీ విస్తరణకు ఆమోదం లభించింది. 79.6 కి.మీ వద్ద నీళ్ళ పీబీసీలో కలుస్తాయని పేర్కొన్నారు. మొత్తంగా ఈ పనులకు రూ. 1,217.49 కోట్ల వ్యయమవుతుందని అంచనా. గతేడాది ఫిబ్రవరిలోనే గుత్తేదారుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. ఇప్పటికి ఏడాదిన్నర దాటినా నిర్మాణాల్లో ఎటువంటి పురోగతి లేదు. అప్పట్లో వేసిన ప్రణాళికలో పుంగనూరు బ్రాంచ్ కాలువ నుంచి సోమల మండలంలోని ఆవులపల్లె జలాశయం వరకు ప్రత్యేక ఫీడర్ చానల్ తవ్వాలని అనుకున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణాన్ని నిలిపేయాలని ఎన్జీటీ స్పష్టం చేసినందున ప్రస్తుతానికి ఈ ప్రతిపాదన పక్కన పెట్టారు. రూ.800 కోట్ల వ్యయంతో పీబీసీని విస్తరించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. త్వరలోనే ఈ అంచనాలపై మరింత స్పష్టత రానుంది.

భూసేకరణకు అడుగులు

కాలువ విస్తరణకు ఎంతమేరకు భూమి అవసరమవుతుందనే అంశాన్ని తేల్చేందుకు బుధవారం నుంచే హెచ్ఎన్ఎస్ఎస్ మదనపల్లె యూనిట్‌లోని రెవెన్యూ సిబ్బంది, ప్రాజెక్టు అధికారులు సర్వే చేయనున్నారు. అనంతరంమంత్రికి నివేదించనున్నారు. మరోవైపు కాలువ ఎంత వెడల్పు ఉండాలి? ఎంత లోతు తవ్వాలి? రాయి తగిలిన ప్రాంతాల్లో ఎంతమేరకు కుదించాలి? అనే దానిపైనా కసరత్తు జరుగుతోంది. అక్టోబరు నుంచే విస్తరణకు శ్రీకారం చుట్టి ఏడాది రెండేళ్లలో ముగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

21 మండలాల్లో వర్షం

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో సోమవారం రాత్రి జిల్లాలోని 21 మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఎస్ఆర్ పురం 66.4 మి.మీటర్లు, గంగాధరనెల్లూరు 45.0, సదుం 40.2, పులిచెర్ల 38.0, తవణంపల్లె 34.2, కార్వేటినగరం 32.4, వెదురుకుప్పం 30.4, విజయపురం 30.2, నగరి 28.2, పెనుమూరు 24.8, పూతలపట్టు 23.6, రొంపిచెర్ల 21.2, పాలసముద్రం 18.4, చిత్తూరు 18.4, చిత్తూరు గ్రామీణ 18.0, సోమల 15.4, యాదమరి 15.0, గుడిపాల 14.6 మి.మీటర్లు కురవగా.. మిగిలిన చోట్ల చిరుజల్లులు పడ్డాయి. మంగళవారం సాయంత్రం పలు మండలాల్లో వర్షం కురిసింది.

☛ పల్లెల పూర్వవైభవానికి అడుగులు

స్వచ్ఛ దృష్టి.. సంపద సృష్టి

సుందర గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. నూటికి నూరు శాతం ఘన, ద్రవవ్యర్థాల నిర్వహణ చేపట్టి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక చేస్తోంది. గత వైకాపా పాలనలో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు ఇప్పటికే శిథిలావస్థకు చేరగా కూటమి ప్రభుత్వం వాటి పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేస్తోంది.


తాళ్వాయపాడులోని చేపల పెంపకం

చిత్తూరు జడ్పీ, గూడూరు న్యూస్‌టుడే

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,189 సంపద సృష్టి కేంద్రాలున్నాయి. వీటిలో అన్ని వసతులున్నవి 280 వరకు ఉన్నాయి. తొలిదశలో వాటి పునఃప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. గ్రామాల శుభ్రతకు పక్కాగా చర్యలు తీసుకోనున్నారు. పంచాయతీల్లో నిధులు అందుబాటులో ఉండటంతో సర్పంచులు ముందుకొస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలను తెదేపా ప్రభుత్వం 2015లో తీసుకొచ్చింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించాయి. ఉపాధిహామీ నిధులు జోడించి వసతులు సమకూర్చారు. ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించారు.

● పెళ్లకూరు మండలం తాళ్వాయపాడు కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. అప్పటి సర్పంచి అనురాధ తడి పొడి చెత్తతోపాటు చేపల పెంపకం, కూరగాయల సాగు చేపట్టారు.

సంపద కేంద్రాల వసతుల వివరాలిలా.. (చిత్తూరు)

వసతి	సంఖ్య
షెడ్లు	579
నీటివసతి	254
రోడ్డు	501
మరుగుదొడ్లు	22
బోర్డులున్నవి	392
విద్యుత్తు	108


అనకవోలు గ్రామంలోని చెత్త సంపద కేంద్రం


ఎరువుల తయారీ..

ప్రతి గ్రామంలో చెత్త సంపద కేంద్రం నుంచి సేంద్రియ ఎరువు తయారీ చేయాల్సి ఉంది. గ్రామాల్లో వచ్చే చెత్తను హరిత రాయబారుల సహకారంతో షెడ్లకు చేర్చి 12 కంపార్ట్‌మెంట్లలో వేయాలి. చెత్తను వానపాముల ద్వారా ఎరువు తయారీ చేయాల్సి ఉంది. ఇలా తయారైన ఎరువులను విక్రయించడంతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది.

అన్నిచోట్లా వసతులు కల్పిస్తాం

అన్నిచోట్లా దశలవారీగా వసతులు కల్పిస్తాం. ఇందుకు అవసరమైన నిధులు వెచ్చించడానికి అవకాశముంది.

- సుశీలాదేవి, జిల్లా పంచాయతీ అధికారి, తిరుపతి



కాణిపాకం: చంద్రప్రభ పల్లకీలో స్వామివారు

చంద్రప్రభ వాహనాయా... రక్షమాం

కాణిపాకం, న్యూస్‌టుడే: ప్రత్యేకోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజున శ్రీ వరసిద్ధి వినాయస్వామి వారు సిద్ధిబుద్ధిలతో కలసి చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి మంగళవారం రాత్రి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను ఓలలాడించారు. స్వామివారి మూలవిగ్రహానికి ఉదయం సంప్రదాయబద్ధంగా పంచామృతాభిషేకం నిర్వహించి, చందనాలకంరణ చేసి ప్రత్యేక నివేదన సమర్పించారు. ఉత్సవమూర్తులను సర్వాలంకృతులు చేసి అలంకార మండపంలో ప్రత్యేక పూజలు చేశారు భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పి.గురుప్రసాద్, కాణిపాకం సర్పంచి కె.శాంతిసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కల్పవృక్ష వాహన సేవ.. ప్రత్యేకోత్సవాల్లో మరో అత్యంత ప్రాముఖ్యమైన కల్పవృక్ష వాహన సేవ బుధవారం రాత్రి జరగనుంది. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు శతకలశ క్షీరాభిషేకం నిర్వహించనున్నారు.

సర్వదర్శనానికి 6 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేకుండా తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 6 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 2 గంటలు పడుతోంది. సోమవారం శ్రీవారిని 65,604 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.85 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

నేడు విద్యుత్తు సమస్యలపై వినతుల స్వీకరణ

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ తిరుపతి సర్కిల్ పరిధిలోని ఎనిమిది డివిజన్, 27 సబ్-డివిజన్ కార్యాలయాల్లో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరించనున్నామని ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. చిత్తూరు అర్బన్ డివిజన్‌కు సంబంధించి స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ, సబ్-డివిజన్ కార్యాలయంలో వినతులను స్వీకరిస్తామని ఈఈ మునిచంద్ర తెలిపారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులు కోరారు. జిల్లాలో గృహావసరాల గ్యాస్ కనెక్షన్లు 6.87 లక్షలు ఉన్నాయి. ఇప్పటి వరకు 67శాతం మంది వినియోగదారులే ఈకేవైసీ చేయించుకోగా.. మిగిలిన 33 శాతం మంది నమోదు చేయించుకోవాల్సి ఉందని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు దీపావళి నుంచి ఉచితంగా మూడు సిలిండర్లు ఇవ్వనున్నారు. ఈకేవైసీ చేయించుకున్న వినియోగదారులకే పథకానికి అర్హత ఉంటుంది.

వినాయకా.. ఇక్కడెంత సురక్షితం

కాణిపాకం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్లు వెల్లడయిన నేపథ్యంలో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో ఎంతవరకు నిబంధనలు పాటించారు.. అనే కోణంలోనూ భక్తులు ఆందోళన చెందుతున్నారు. స్వామివారి ఆలయంలో ఉప్పు, చక్కెర పొంగళి ఇతర ప్రసాదాలతోపాటు భక్తులకు అందించే లడ్డూ ప్రసాదాల తయారీకి నెలకు సుమారు మూడువేల కిలోల నెయ్యి కొలుగోలు చేస్తున్నారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా.. 2018 నుంచి ఆలయానికి ప్రైవేటు డెయిరీల నుంచి నెయ్యి సేకరిస్తున్నారు. అంతకు ముందు కేఎంఎఫ్ (కర్ణాటక మిల్క్ ఫెడరేషన్) నుంచి కొనుగోలు చేసేవారు. తదనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వ హయాంలో రివర్స్ టెండరింగ్, నెగోషేషియన్ పద్ధతి అవలంబించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంతోపాటు కాణిపాకం ఆలయానికి తిరుపతికి చెందిన ఓ సంస్థ నుంచి సరకులు కొంటున్నారు. కేఎంఎఫ్ కాకుండా మరో రెండు ప్రైవేటు డెయిరీలకు చెందిన నెయ్యిని కొనుగోలు చేశారు. అలాగే ఆలయానికి కావాల్సిన సరకులు కొనుగోలు వైకాపా హయాం ఐదేళ్లు చాలా గోప్యంగా ఉంచారు. గతేడాది తిరుమలకు నెయ్యి సరఫరా చేస్తున్న వైష్ణవి సంస్థ నుంచి కిలో రూ.555 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ డెయిరీల నుంచి కాకుండా ప్రైవేటు డెయిరీలపై అధికారులు మక్కువ చూపడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.

సరకుల కొనుగోలులో గతంలో గోప్యత



కమిటీలున్నా.. తనిఖీలు సున్నా

గత ప్రభుత్వ హయాంలో కాణిపాకం ఆలయ పాకలమండలి తరపున కొనుగోలు కమిటీ ఏర్పాటు చేశారు. ఆలయానికి కావాల్సిన సరుకులు, ఇతర వస్తువులు ఈ కమిటీ పరిశీలించి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఏ ఒక్కరోజు ఆలయానికి వచ్చిన సరకులను కమిటీ పరిశీలించిన దాఖలాలు లేవు. గుత్తేదారులు పంపిన వస్తువులను యథావిధిగా ఆలయ గిడ్డంగికి చేర్చేవారు. ఫలితంగా నాణ్యతపై భక్తులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. 2018 ముందుకు ఆలయానికి వచ్చే సరకులను ప్రభుత్వ ఆహార తనిఖీ సంస్థ వచ్చి.. శాంపిల్స్‌ను తీసుకెళ్లి పరిశీలించేది. గత ఐదు సంవత్సరాలు గుత్తేదారుడు ఇచ్చిన నివేదికలను ఆధారం చేసుకొని కొనుగోలు చేశారు. రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ గత శనివారం ఆలయ గిడ్డంగిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసాదాల తయారీకి కొనుగోలు చేస్తున్న నెయ్యి వెంటనే ప్రభుత్వరంగ సంస్థకు పంపి నాణ్యత పరిశీలించాలని ఆదేశాలు జారీచేశారు. అధికారులు నెయ్యి శాంపిల్‌ను తనిఖీ నిమిత్తం పంపారు. నాణ్యతపై భక్తుల్లో నెలకొన్న ఆందోళనలు తొలగించాల్సి ఉంది.

ఇద్దరు సబ్ ఇంజినీర్లపై వేటు

నియంత్రికల మరమ్మతు కేంద్రాల అక్రమాలపై విచారణ

ఈనాడు కథనానికి స్పందన

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: పలమనేరు, పీలేరు నియంత్రికల మరమ్మతు కేంద్రాల అక్రమాలపై ఆ శాఖ అధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. ‘ఈనాడు’లో ఈనెల 23న ‘కాలిన కమ్మీల్లో..కోట్లు దండుకున్నారు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్తు శాఖ ఎస్ఈ సురేంద్రనాయుడు స్పందించారు. అవినీతికి పాల్పడిన పలమనేరు, పీలేరు నియంత్రికల మరమ్మతు కేంద్రాల సబ్-ఇంజినీర్లు సూర్యతేజ, కమల్ గణేష్‌లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు వివరించారు. అక్కడి ఏఈలకు బాధ్యతలు అప్పగించారు. తుప్పు కమ్మీలను అక్రమంగా విక్రయించి నిధులు స్వాహా చేసిన అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేసి వీలైనంత త్వరగా నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. నియంత్రికల మరమ్మతు కేంద్రాల ఈఈ మహేశ్వర్‌రెడ్డి కడప జిల్లాకు బదిలీ అయ్యారు. అవినీతి అక్రమాలపై విచారణ పూర్తయ్యేంతవరకు ఈయన ఇక్కడి నుంచి రిలీవ్ కాకూడదని ఉన్నతాధికారులు సూచించినట్లు సమాచారం.

అందుబాటులో 800 నియంత్రికలు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: చిత్తూరులోని విద్యుత్తు శాఖ గోదాముకు మంగళవారం 63కేవీ నియంత్రికలు 800 చేరాయి. అవసరాలకు అనుగుణంగా నియంత్రికలు, అనుబంధ పరికరాలు అందుబాటులో ఉన్నాయని విద్యుత్తు శాఖ ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు.

చెలరేగిపోతున్న ఇసుక స్మగ్లర్లు


క్యాటిల్‌ఫారం వద్ద అడుగునకు తోడేసిన ప్రదేశం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణానికి సమీపంలోని క్యాటిల్ ఫారం వద్ద ఇసుక స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఇష్టమొచ్చినట్లు ఇసుకను తోడేస్తున్నారు. ఇప్పటికే కౌడిన్య నది పొడవునా ఉన్న చెక్‌డ్యాంలను కూలదోసేశారు. ప్రస్తుతం నది అంచున ఉన్న వృక్షాలను సైతం నాశనం చేస్తున్నారు. ఇసుక కోసం వృక్షాల కింది భాగం వేర్ల వరకు తోడేయడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మెల్లగా వృక్షాలు నేలవాలుతాయి. మంగవారం కొందరు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దుండగులు అక్కడి నుంచి తమ ట్రాక్టర్లను తీసుకుని పారిపోయారు. ప్రస్తుతం నది పొడవునా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లోని ఇసుకను సైతం తోడుకుంటున్నారు. సోమవారం నాగమంగళం వక్ఫ్ బోర్డుకు చెందిన భూముల్లో ఇసుక తోడుతుంటే గ్రామస్థులు అడ్డుకుని అక్కడి నుంచి తరిమేశారు. కురప్పల్లె, రామాపురం, క్యాటిల్ ఫారం సమీపంలోని గ్రామాల పరిధిలో రైతులు వ్యవసాయ అవసరాల కోసం నదిలో మోటార్లు పెట్టి నీటిని వాడుకుంటున్నారు. దుండగులు రాత్రి సమయాల్లో ఇసుకను తోడటమే కాకుండా నదిలోని మోటార్లను కూడా చోరీ చేస్తున్నారు. ఈ సమస్యపై అధికారులు గట్టిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా సంఘటన స్థలానికి తహసీల్దారును పంపి పరిశీలిస్తామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఇసుకను తరలిస్తుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విధేయతకు అందలం

కూటమి ప్రభుత్వంలో మొదలైన పదవుల పందేరం

ఈనాడు, చిత్తూరు: నిరీక్షణ, ఉత్కంఠకు తెరదించుతూ కూటమి ప్రభుత్వం మంగళవారం పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. తొలి నుంచీ పార్టీ పట్ల విధేయత, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉన్న వ్యక్తులకే ఈ జాబితాలో పెద్దపీట వేశారు. మలివిడతలో మరిన్ని పోస్టులను ప్రకటించే అవకాశం ఉంది. దసరా నాటికి పదవుల పందేరాన్ని పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తదుపరి వెల్లడించే జాబితాలో జనసేన, భాజపా నాయకులకూ చోటు లభించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తోన్న కుప్పం నుంచి ఆయనకు సన్నిహితుడైన పీఎస్ మునిరత్నాన్ని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పదవి వరించింది. దీంతో ఆయనకు కేబినెట్ హోదా లభించనుంది. పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ సభ్యులుగా పదిమందిని నియమించగా చిత్తూరు నియోజకవర్గం నుంచి మాజీ మేయర్ కఠారి హేమలతను ఎంపిక చేశారు. ఆమె అత్తామామలు అనురాధ, మోహన్ తెలుగుదేశానికి సేవలందిస్తూ నగరపాలక సంస్థ కార్యాలయంలోనే హత్యకు గురయ్యారు. భర్త ప్రవీణ్ కరోనాతో మరణించారు. పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా పుత్తూరు మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గంజి మాధవయ్యకు అవకాశం ఇచ్చారు. రామకృష్ణాపురం సర్పంచి, ఎంపీపీగా ఆయన పనిచేశారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన చురుగ్గా పనిచేసి ప్రశంసలందుకున్నారు.

రెండో జాబితాపై ఆశావహులు..

నామినేటెడ్ పదవులను కట్టబెట్టేందుకు తెలుగుదేశం పార్టీ పెద్ద ఎత్తున కసరత్తు చేసింది. కార్యకర్తల అభిప్రాయాలతోపాటు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గాల పరిశీలకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది. మేలో జరిగిన ఎన్నికల్లో ఆయా నాయకుల పరిధిలోని బూత్‌లు, యూనిట్లు, క్లస్టర్లలో ఎంత మెజార్టీ వచ్చిందో ఆరా తీసింది. వీటి ప్రకారమే తొలి జాబితాను వెల్లడించినట్టు తెలుస్తోంది. ఇందులో పేర్లు లేని చాలా మంది రెండో జాబితాపై ఆరా తీస్తున్నారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా మునిరత్నం


చంద్రబాబుతో మునిరత్నం (పాతచిత్రం)

కుప్పం : కుప్పం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నంను ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. కుప్పం గ్రామీణ మండలం కంగుంది గ్రామానికి చెందిన మునిరత్నం తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. కంగుంది సర్పంచిగా, కుప్పం ఎంపీపీగా పదవులు చేపట్టారు. 2014-19 మధ్య కాలంలో కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) ఛైర్మన్‌గా పనిచేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా.. పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్న ఆయన సేవలను గుర్తించడంపై శ్రేణుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

పర్యాటక కార్పొరేషన్ సభ్యురాలిగా కఠారి హేమలత



చిత్తూరు (జిల్లా పంచాయతీ) : నామినేటెడ్ పదవుల భర్తీల్లో జిల్లాకు ప్రాధాన్యం దక్కింది. ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సభ్యురాలిగా చిత్తూరు నగర తెదేపా అధ్యక్షురాలు, +మాజీ మేయర్ కఠారి హేమలతకు అవకాశం ఇచ్చారు. ఆమె పార్టీలో క్రియా శీలకంగా ఉంటూ పని చేస్తున్నారు. అందుకు గుర్తింపునిస్తూ ఆమెకు ఈ పదవిని కేటాయించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంజి మాధవయ్య



పుత్తూరు : పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పుత్తూరుకు చెందిన గంజి మాధవయ్యను ప్రభుత్వం నియమించింది. మాధవయ్య 2013లో రామకృష్ణాపురం సర్పంచి, 2014లో ఎంపీటీసీ సభ్యుడిగా గెలిచి 2014- 19 వరకు పుత్తూరు ఎంపీపీగా పనిచేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గాను ఉన్నారు.



పవిత్ర కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, ఎమ్మెల్యే, అధికారులు

ఆగమోక్తం.. ప్రాయశ్చిత్త శాంతి హోమం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో ఆగమోక్తంగా ప్రాయశ్చిత్త శాంతి హోమాన్ని అన్వేటి మండపంలో మంగళవారం ఉదయం నిర్వహించారు. యాగశాల వద్ద గణపతిపూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, కలశపూజ, ప్రాయశ్చిత్త హోమం, మహా పూర్ణాహుతి చేపట్టారు. కలశాలలోని పవిత్ర జలంతో ఆలయం, పరిసరాలు సంప్రోక్షణ చేశారు. లోక కల్యాణార్థం, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ఈ యాగాన్ని నిర్వహించినట్లు వివరించారు. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఈవో పి.గురుప్రసాద్, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచి కేసీ మధుసూధన్‌రావు, మాజీ జడ్పీటీసీ లత పాల్గొన్నారు.

లడ్డూలో పొగాకు పొట్లం అవాస్తవం: తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదంలో పొగాకు పొట్లం ఉన్నట్లు కొంతమంది భక్తులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం భావ్యం కాదని, అది అవాస్తవమని తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. 'తిరుమలలోని లడ్డూ పోటులో శ్రీవైష్ణవ బ్రాహ్మణులు అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో శ్రీవారి లడ్డూలను రోజూ లక్షలాదిగా తయారు చేస్తారు. ఈ లడ్డూల తయారీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుంది. ఇంతటి పకడ్బందీగా లడ్డూలు తయారు చేసే వ్యవస్థలో ఈ విధంగా పొగాకు ఉన్నట్లు ప్రచారం చేయడం శోచనీయం. భక్తులు ఈ విషయాన్ని గమనించాల'ని తితిదే కోరింది.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా పాలనాధికారి సుమిత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు వినతులు అందించి పరిష్కారం పొందవచ్చునని అన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

జిల్లా, మండల స్థాయి కమిటీల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047 జిల్లా స్థాయి విజన్ డాక్యుమెంట్ తయారీకి జిల్లా, మండల స్థాయి అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 26లోగా గ్రామ/వార్డు సభలు నిర్వహించాలన్నారు 27 నుంచి 29 వరకు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. ఈనెల 30 నుంచి అక్టోబరు 5 వరకు ప్రజాప్రతినిధులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి సలహాలు, సూచనల్ని స్వీకరిస్తామన్నారు. మండల స్థాయి ప్రణాళికను ఈ నెల 30లోగా, జిల్లా స్థాయి ప్రణాళికను అక్టోబరు 15న రూపొందించాలన్నారు.

- స్వర్ణాంధ్ర 2047 కరపత్రాలు, స్టిక్కర్ల పంపిణీని పూర్తిచేసి సచివాలయాల వారీగా సమాచారాన్ని ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
- ఈ నెల 26న కుప్పంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

పెట్టుబడులు తగ్గి.. దిగుబడులు పెరిగేలా

అన్నదాత వద్దకే శాస్త్రవేత్తలు, అధికారులు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఏటికేడు పంట సాగు పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఈ స్థాయిలో దిగుబడులు కళ్లజూడకపోవడంతో కర్షకులకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ఆధునిక సేద్యాన్ని అందిపుచ్చుకోలేక పోవడం ప్రతిబంధకంగా మారుతోంది. గత ప్రభుత్వ పాలనలో క్షేత్రస్థాయిలో వారిని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు వ్యవసాయంపై దృష్టి సారించింది. 'పొలం పిలుస్తోంది' పేరుతో శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల, సేంద్రియ, మార్కెటింగ్ శాఖ అధికారుల బృందాన్ని పొలం బాట పట్టాలని నిర్దేశించింది. వీరంతా రైతుల సాగు కష్టాలు తెలుసుకుని..'దిగు'బడి వేదన వింటారు. ఖరీఫ్, రబీల్లో నాలుగేసి నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వయించేలా ఆదేశాలిచ్చారు. తొలుతగా ఈ నెల 24న కార్యక్రమం ప్రారంభం కానుంది. జిల్లాలో ఈ కార్యక్రమంలో విస్తృతంగా చేపట్టి విజయవంతానికి నిధులు కేటాయించారు.

లక్ష్యం ఇదీ..

పంటల దిగుబడి, రైతుల ఆదాయం పెంచడం ప్రధాన లక్ష్యం. రైతులకు నూతన సాగు పద్ధతుల వైపు నడిపించడం, దిగుబడి తగ్గడానికి కారణాలు విశ్లేషించడం, సూక్ష్మ పోషకాల లోపాన్ని గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేయడం, ఇప్పటికే పరీక్షలు పూర్తయితే భూసార పరీక్ష ఫలితాల కార్డులు అందజేయడం, బిందు, తుంపర్ల సేద్యం పథకం పరికరాలను అందజేసి విస్తరించనున్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతుమిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా రుణాల మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేలా చైతన్యం చేస్తారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇవి కొనసాగుతాయి. అవసరాన్ని బట్టి 14శాఖల సేవలు వినియోగించుకోవాలని, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం సూచించింది.



గుడుపల్లె మండలం కనమనపల్లెలో అవగాహన కల్పిస్తున్న పట్టు పరిశ్రమ శాఖ ఏడీ హనుమంతు, చిత్రంలో ఏవో, ప్రత్యేకాధికారి, పశువైద్యాధికారి

ఆదాయం పెంచేందుకు..

పటిష్ఠంగా 'పొలం పిలుస్తోంది' నిర్వహణకు చర్యలు చేపట్టాం. సాగు విస్తీర్ణం, దిగుబడులు, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఇది దోహదపడుతుంది. నూతన సాగు పద్ధతులు అందిపుచ్చుకుంటే మేలు. అధిక సంఖ్యలో రైతుల భాగస్వామ్యానికి అధికారులు దృష్టి సారించాలి. కర్షకులు సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయ అనుబంధ శాఖలన్నీ ఇందులో పాల్గొంటాయి. **-మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి**

జిల్లాలో పంటల సాగు వివరాలు (హెక్టార్లలో)	
ఖరీఫ్ సాధారణ సాగు	81,169
రబీ సాధారణ సాగు	29,026
ఉద్యాన పంటలు	91,000
మల్బరీ	16,800

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధి శీగలపల్లెలోని సమీకృత వ్యవసాయ కేంద్రాన్ని మధ్యప్రదేశ్ శాస్త్రవేత్తలు, రైతులు మంగళవారం పరిశీలించారు. ఏ-గ్రేడ్ పద్ధతిలో కూరగాయల సాగు, వేరుసెనగ యూనివర్సల్ మోడల్, ఎన్‌పీఎం పద్ధతులను పరిశీలించారు. రైతు క్రిష్ణమూర్తి ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే లాభాలను వివరించారు. అనంతరం స్వయం సహాయ మహిళా సంఘ సభ్యులతో సంఘాల ద్వారా అభివృద్ధి, ఆదాయాలు, పొదుపు, రుణాలను గురించి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు వాసు, టీఎల్ డా.పుష్ప, గురుప్రసాద్, నాంచారమ్మ, కల్పన పాల్గొన్నారు.



పురపాలిక పరిధిలోని శీగలపల్లెలోని ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మధ్యప్రదేశ్ శాస్త్రవేత్తలు, రైతులు

ఆధునిక పద్ధతులతో అధికాదాయం

నింద్ర, న్యూస్‌టుడే: రైతులు సాంకేతిక, నూతన పద్ధతులు అవలంబిస్తే సత్ఫలితాలు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని కావనూరు, శ్రీరామాపురం పంచాయతీల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చెరకు పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మెలకువలు పాటించాలన్నారు. ఏవో తులసీరామ్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కావనూరులో చెరకు పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

దేశీ ఆవు.. కసాయి చేతిలో

పెద్దఎత్తున కేరళకు తరలిస్తున్న వ్యాపారులు

పలమనేరు, న్యూస్‌టుడే: గోమాత కన్నీరు పెడుతోంది. దేశీరకం పెద్దఎత్తున కబేళాకు తరలుతోంది. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వాటిని పోషించలేక అందినకాడికి విక్రయించేస్తున్నారు. కేరళ రాష్ట్రంలో వాటి మాంసానికి గిరాకీ ఉండటంతో వ్యాపారులు ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాకుండా అనంతపురం నుంచి పెద్దఎత్తున తమిళనాడు అట్నుంచి కేరళకు రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పెద్దగా కురవకపోవడంతో వీటి పరిరక్షణ కష్టంగా మారింది. పచ్చగడ్డి కొనుగోలు చేస్తే ఏమాత్రం గిట్టుబాటు కాని పరిస్థితి. రైతులు పాల కోసం జర్సీ, హెచ్‌ఎఫ్ ఆవులను ఎక్కువగా పోషిస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు దేశీయ ఆవుల కోసం కాపుకాచి వారపు సంతల్లో కొనుగోలు చేస్తుంటారు. పలమనేరు, పుంగనూరు వారపు సంతల్లో రైతులు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వీటిని ప్రభుత్వం సంరక్షించకుంటే భవిష్యత్తులో వీటి ఆనవాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

జిల్లాలో దేశీయ ఆవుల సంఖ్య	
సంవత్సరం	సంఖ్య
2019	80,000
2020	75,000
2021	69,000
2022	65,000
2023	60,000



పూర్తిగా టార్పాలిన్ కప్పి పశువులను తరలిస్తున్న లారీ

అటవీ సమీప గ్రామాల్లో..

చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం అటవీ సమీప గ్రామాల్లో మాత్రమే దేశీ ఆవులు కనిపిస్తున్నాయి. వీటికోసం పెద్దగా ఖర్చుపెట్టకపోయినా రోజుకు రెండు నుంచి మూడు లీటర్ల పాలు ఇస్తుంటాయి. ఉదయం అడవిలోకి వదిలేస్తే సాయంత్రానికి మేతమేసి వస్తుంటాయి. వర్షాకాలంలో చెరువులు, పచ్చిక బీళ్లలో ఇవి ఆహారాన్ని పొందుతాయి.

చట్టాలు చుట్టాలుగా మారి

ప్రతియేటా దేశీయ ఆవుల సంఖ్య 5 నుంచి 6 శాతం తగ్గిపోతోంది. జంతు సంరక్షణ చట్టం ప్రకారం పశువులను వాహనాల్లో తరలించరాదు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా వ్యాపారులు పూర్తిగా టార్పాలిన్లు కప్పి కంటైనర్లు, లారీల్లో తరలిస్తున్నారు. గతంలో పోలీసులు పశువుల రవాణా మీద దృష్టిపెట్టేవారు. పశువులను పట్టుకుంటే ఎక్కడ ఉంచాలి.. మేత ఎలా అన్న విషయంలో ఇబ్బందులు ఎదురవడంతో పట్టించుకోవడం లేదు. పట్టణానికి సమీపంలోని ఒక గిడ్డంగిలో పశువుల మాంసానికి సంబంధించిన ఎముకలు నిలువ చేసేవారు. దానిపై పట్టణ వాసులు ఇటీవల మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పశుమాంసం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నందున నాటు ఆవులే కాకుండా ఆ జాతికి చెందిన కోడెదూడలను సైతం మాంసానికి విక్రయిస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం

పశువుల రవాణా విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఎవరైనా సరే తమకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం
- ప్రభాకర్, డీఎస్పీ, పలమనేరు

ఏఎస్‌వో శేషాచలరాజు తిరుపతికి బదిలీ

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లా సహాయ పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలరాజును తిరుపతికి బదిలీ అయ్యారు. తిరుపతి పౌరసరఫరాల శాఖ అధికారి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీఎస్‌వోగా శేషాచలరాజుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సక్రమంగా పని చేయకుంటే ఉపేక్షించం

ఐరాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ అధికారులు ఎవ్వరైనా సక్రమంగా పని చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేసినట్లు తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ హెచ్చరించారు. మండలంలోని నాంపల్లెలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంగళవారం కలసి పాల్గొని మాట్లాడారు. రైతాంగాన్ని ఎన్ఆర్ఈజీఎస్‌కు అనుసంధానం చేయాలని పలువురు రైతులు ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వారు స్పందించి అనుసంధానానిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు టీఆర్ రాజన్, మండల అధ్యక్షుడు వడ్లపాటి గిరిధర్‌బాబు, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు హరిబాబునాయుడు, సర్పంచి స్వర్ణ పాల్గొన్నారు.



నాంపల్లెలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, నాయకులు

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. డైకిన్, ముత్తూట్ గ్రూప్, యంగ్ మైండ్స్ టెక్నాలజీ సొల్యూషన్స్, ఏజీఎస్ హెల్త్ సర్వీసెస్, ఖజానా జువెలరీస్, క్రియా టెక్నాలజీ సంస్థలు 88 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. చిన్న ఉద్యోగమైనా నిజాయితీతో పనిచేస్తూ, నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. జేడీఎం సరితారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల గ్రీవెన్స్‌కు 16 ఫిర్యాదులు అందాయి. ఆశా కార్యకర్తలపై చిన్న చూపు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలకు సంబంధించిన పనులను కూడా తమకే అప్పగిస్తున్నారని, వ్యాక్సినేషన్ క్యారియర్లు మోయిస్తున్నారని, ఇతరాత్ర పనులను కూడా తమతో చేయిస్తుండడంతో ఇబ్బందిగా ఉందని తెలిపారు. సమస్యలపై డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి స్పందించారు. అన్నింటిని పరిశీలించి, పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. డీఐవో హనుమంతరావు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో ప్రభావతిదేవికి ఫిర్యాదు అందిస్తున్న ఆశాలు

ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్న గ్రామస్థులు

నగరి,న్యూస్‌టుడే: కుశస్థలినదిలో రాత్రి వేళ ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తెరణి గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తుంటే, తెరణి గ్రామస్థులు మాత్రం నిఘాతో అడ్డుకుంటున్నారు. గ్రామానికి చెందిన యువత రాత్రివేళ ఇసుక తోడుతున్న ట్రాక్టర్లను అడ్డుకొన్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఉదయం నగరి పోలీసులు వచ్చి మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.



కుశస్థలినదిలో ఇసుక ట్రాక్టర్ల అడ్డుకొని పోలీసులకు అప్పగిస్తున్న గ్రామస్థులు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు.. బంగారం స్వాధీనం

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలో చోరీ చేసి పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్న ఓ దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ.8 లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం వివరాలు డీఎస్పీ సాయినాథ్ విలేకర్లకు వెల్లడించారు. వరుస చోరీల నేపథ్యంలో సీఐలు జయరామయ్య, నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో బృందాలు ఏర్పాటు చేశారు. ఆధారాలు, సీసీ ఫుటేజీ ఆధారంగా కీలకమైన సమాచారం సేకరించి తమిళనాడులోని వెల్లూరు జిల్లా గుడియాత్తం.. వల్లత్తూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ బిలాల్ నిందితుడిగా గుర్తించారు. అతన్ని పక్కా సమాచారంతో తమిళనాడులోని కాట్పాడిలో అరెస్టు చేసి విచారించగా అన్ని చోరీలు వెలుగు చూశాయి. అతని నుంచి రూ.8 లక్షల విలువైన 130 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు వివరించారు. సీఐలు, ఎస్సైలను ఆయన అభినందించారు.



నిందితుడిని అరెస్టు చేసి, ఆభరణాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

అడ్డగోలుగా తరలిస్తూ.. లారీ బోల్తా

పాలసముద్రం, న్యూస్‌టుడే: నీవానది నుంచి అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్న ఇసుక లారీ అర్ధరాత్రి బోల్తా పడింది. సీఐ హనుమంతప్ప కథనం మేరకు.. వెంగళరాజుకుప్పం పంచాయతీ కనికాపురం గ్రామ సమీపంలో ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్ పవన్‌కుమార్, క్లీనర్ విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడుకు తరలించేందుకు జీడీనెల్లూరు నీవానది నుంచి ఇసుక తూగుండ్రం గ్రామానికి చెందిన సుధాకర్ వారికి అందించినట్లు, రెడ్‌హిల్స్‌లోని మునస్వామి అనే వ్యక్తికి తరలిస్తున్నట్లు తెలిపారు. లారీ యజమాని ప్రకాశం జిల్లా, కందుకూరుకి చెందిన శ్రీనివాసులరెడ్డిగా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



తలకిందులుగా పడిపోయిన లారీ

గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం గ్రామీణ మండలం పొన్నాంగూరు గ్రామంలో మంగళవారం పొలంలో పండిస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేసి, ఇద్దరిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జీటీ నాయుడు తెలిపారు. పొన్నాంగూరు ఏకనాథన్ తనకు చెందిన పొలంలో 6 గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. వాటిని ధ్వంసం చేసి 200 గ్రాముల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి విత్తనాలు సరఫరా చేసిన కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు	
బ్రాయిలర్ (రైతు ధర)	122
రిటైల్	144
లేయర్	115
బ్రాయిలర్స్	209
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	238
లేయర్ మాంసం	195

మోసం కేసులో యువకుడికి రిమాండ్

వెదురుకుప్పం: రెవెన్యూ నకిలీ పత్రాలు సృష్టించి మోసానికి పాల్పడిన కేసులో యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మండల పరిధి జక్కదొన రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబరు 513-16లో 0.66 సెంట్ల భూమికి నకిలీ పత్రాలు సృష్టించి పాకాల సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన గంటావారిపల్లెకు చెందిన పుల్లారెడ్డి కుమారుడు జయచంద్రారెడ్డిపై పొలం యజమాని నీలమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి అతన్ని అరెస్ట్ చేసి పుత్తూరు కోర్టుకు తరలించగా రిమాండు విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చిత్తూరు

●చిత్తూరు ●పూతలపట్టు ●గంగాధరనెల్లూరు ●నగరి

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల సత్తా


క్రీడాకారులను అభినందిస్తున్న చంద్రశేఖర్‌రాజు

వడమాలపేట, న్యూస్‌టుడే: తిరుపతి శ్రీనివాస క్రీడా సముదాయంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బాల బాలికల జూడో పోటీలు మంగళవారం నిర్వహించారు. వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు లీలా, వెన్నెల, షణ్ముగం, ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. కేటగిరీలో ఈ ముగ్గురు కాంస్య పతకాలు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయిని కరుణానవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు అభినందించారు.

ఎంపీకి వినతి

గుడిపాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సావర్కర్ ట్రస్టు అధ్యక్షుడు దేవరాజన్ మంగళవారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావును కలిసి వినతి పత్రం అందజేశారు.


కట్టమంచి చెరువు కట్టపై చర్చిస్తున్న ఎంపీ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్

చెరువు సుందరీకరణకు చర్యలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: కట్టమంచి చెరువు సుందరీకరణకు చర్యలు చేపట్టాలని పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు సూచించారు. స్థానిక కట్టమంచి చెరువును మంగళవారం సాయంత్రం ఆయన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలసి పరిశీలించారు. చెరువులో పూడికతీత పనులు చేపట్టాలని జలవనరులశాఖ అధికారుల్ని ఆదేశించారు. బలహీనంగా ఉన్న చెరువు కట్టకు మరమ్మతు పనులు ప్రారంభించాలన్నారు. నగర మేయర్ అముద, ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు. **చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ కార్యాలయాల్ని పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ వివేకానంద భవన్‌లోని వివిధ సెక్షన్లు, సీపీవో, జిల్లా పౌరసరఫరాల సంస్థ, ఎస్‌ఐసీ, పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. దస్త్రాల నిర్వహణ మెరుగ్గా ఉండాలని, నిరుపయోగ వస్తువుల్ని తొలగించాలని పేర్కొన్నారు. డీఎస్‌వో శంకరన్, పౌరసరఫరాల డీఎం మోహన్‌రాజ్ పాల్గొన్నారు.


వార్డెన్‌తో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

బంగారుపాళ్యం: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు విద్యాధరి మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆమె వసతి గృహాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. గత ప్రభుత్వం నాడు నేడు పథకంలో మంజూరు చేసిన మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండటాన్ని గుర్తించారు. మౌలిక వసతులపై వసతి గృహ వార్డెన్ గీతతో ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ మేరకు నాణ్యమైన భోజనం పెట్టాలని చెప్పారు.

'పొన్నవోలు విమర్శలు అర్థరహితం'

పుత్తూరు,న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ వివాదానికి సంబంధించి మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి విమర్శలు అర్థరహితమని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు పేర్కొన్నారు. పుత్తూరులో మాట్లాడారు. పంది కొవ్వును బంగారంతో, ఆవు నెయ్యిని రాగితో పోల్చడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు.

వైకాపా నిర్లక్ష్యం..గుత్తేదారుల విముఖత

- వెరసి మూడేళ్లుగా మొదలు కాని మరమ్మతులు
- పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు కట్ట కుంగిన ఘటన
- అడ్డగోలుగా పురపాలిక సాధారణ నిధుల స్వాహా

పుత్తూరు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. అప్పటి మంత్రి చేతిగానితనం.. గుత్తేదారుల విముఖతతో పుత్తూరు పట్టణ వాసుల దాహార్తి తీర్చే ట్యాంకు భద్రత ప్రమాదంలో పడింది. మూడేళ్ల కిందట కట్ట కుంగింది. నిధులు తెస్తానంటూ అప్పటి మంత్రి కాలయాపన చేశారు. బిల్లులు మంజూరు చేయకుండా గుత్తేదారులను వేధించడంతో వారు టెండర్లకు విముఖత చూపారు. దీంతో ఆ ట్యాంకు మరమ్మతుల్లో అంతులేని జాప్యం జరుగుతూ..నే ఉంది.

2006లో నిర్మాణం.. ఇప్పటికీ నిరుపయోగం

పుత్తూరు ప్రజల దాహార్తిని తీర్చడానికి రూ.55కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించారు. గాలేరు-నగరి ప్రాజెక్టు కాలువ నుంచి నీటిని తీసుకునే విధంగా 2006లో అధికారులు డిజైన్ చేసి పూర్తి చేసి మున్సిపాలిటీకి అప్పగించారు. గాలేరు-నగరి ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. కాంగ్రెస్ హయాంలో దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు రూ.1.10కోట్లతో వర్షాకాలంలో చెరువుకు చేరిన నీటిని ఎస్ఎస్ ట్యాంకులోకి నింపి తద్వారా ఫిల్టర్ చేసి తాగునీటిని అందించాలని సంపు నిర్మించి మోటారు ఏర్పాటు చేయించారు. నాలుగైదు ఏళ్లుగా ఇలానే చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు అందులోని చుక్క నీరు దాహార్తి తీర్చడానికి వినియోగించిన దాఖలాల్లేవు.

అంచనాలు తప్పడంతో కుంగిన కట్ట

2021లో కురిసిన భారీ వర్షాలకు ఎస్ఎస్ ట్యాంకును పూర్తి స్థాయిలో నీటిని నింపారు. 2021, మే 18న ట్యాంకు కట్ట అకస్మాత్తుగా కుంగిపోయింది. ప్రభుత్వం నిపుణుల కమిటీని వేసింది. ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి 10 ఏళ్లవుతున్నా.. అప్పటి నుంచి నీటిని నింపలేదు. ఒక్కసారిగా పూర్తి స్థాయిలో నీటిని నింపడంతో సుమారు 300 మీటర్లు మేర కట్ట కుంగిందని నిపుణులు బృందం నివేదిక ఇచ్చారు.


2021 మే 18న పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు కుంగిన దృశ్యం (పాతచిత్రం)

రూ.43 లక్షల స్వాహా

అయితే అప్పటి వైకాపా నాయకులు తాత్కాలిక మరమ్మతుల పేరిట నిధులు స్వాహా చేశారు. అప్పటి అధికారుల సహకారంతో నాయకులు మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.43 లక్షలు ఖర్చు చేసినట్లు మున్సిపాలిటీలో తీర్మానం చేసి బిల్లులు చేయించుకున్నారు. ఈ బిల్లులు చేయడానికి అప్పటి డీఈఈ అడ్డు చెప్పడంతో అతన్ని బదిలీ చేసి మరో అధికారిని నియమించి తమ అక్రమాన్ని కొనసాగించారు. ఈ పనులు చేసి కూడా మూడేళ్లు అవుతోంది. మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు ప్రజారోగ్యశాఖ ద్వారా మున్సిపాలిటీకి చెల్లిస్తామని అప్పట్లో ఉన్న ఉమ్మడి జిల్లా కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. అయితే ఇప్పటి నిధులు మాత్రం మున్సిపాలిటీకి జమకాకపోవడం గమనార్హం.


మరమ్మతులు చేయకపోవడంతో అలాగే ట్యాంకు కుంగిన ప్రాంతం

మంత్రిగా ఉన్నా.. ప్చ్

మాజీ మంత్రి ఆర్కే రోజా నిధులు అదిగో వస్తున్నాయి . . ఇదిగో వస్తున్నాయని మూడేళ్లు గడిపారు. ఎన్నికల ఏడాది దిన రూ.9 కోట్లు మంజూరు చేశారు. అయితే ఎన్నికల సమయం కావడంతో పనులు చేస్తే బిల్లులు వస్తాయో లేదో అని గుత్తేదారులు పనులు చేయడానికి ముందుకు రాలేదు. ఇటీవల ప్రజారోగ్యశాఖ అధికారులు మూడు దఫాలు టెండర్లు పిలిచినా స్పందన కరవైంది.

మరోసారి టెండర్లు పిలుస్తాం..: గతంలో రూ.9 కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు టెండర్లు పిలిచాం. గుత్తేదారులు రాకపోవడంతో రద్దు చేశాం. ఈ ప్రభుత్వ హయాంలో మరోదఫా పిలుస్తాం. టెండర్ల దాఖలు కాగానే పనులు చేపడతాం. - దేవిక, ప్రజారోగ్యశాఖ ఈఈ, తిరుపతి

రైల్వే ప్రభావిత చెరువులకు మరమ్మతు చేపట్టాలి

పూతలపట్టు, న్యూస్‌టుడే: మండలంలో రైల్వే ప్రభావిత చెరువులు 21 ఉన్నాయని వాటిని మరమ్మతులు చేపట్టాల్సి ఉందని సీఎం చంద్రబాబుకు స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోకి వస్తున్న రైల్వే ఎఫెక్టింగ్ ట్యాంక్స్ (ఆర్‌ఏటీ) మైనర్ ఇరిగేషన్ కింద ఉన్నాయని, చాలా ఏళ్లుగా వీటి నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో మరమ్మతులు చేపట్టలేదన్నారు. వర్షకాలం వస్తున్న నేపథ్యంలో ఆర్‌ఏటీల మరమ్మతులు చేపట్టి నిర్వహణకు అవసరమైన నిధులు దక్షిణ మధ్య రైల్వే, జలవనరుల శాఖతో లైన్ డిపార్ట్‌మెంట్‌తో కొనసాగించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

హామీలు నెరవేరుస్తున్నాం: ఎమ్మెల్యే


ఎంపీ, ఎమ్మెల్యేకు హారతి పడుతున్న మహిళలు

గుడిపాల, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అధికారంలోకి వచ్చి తొలి సంతకం పెట్టినప్పట్నుంచే మొదలు పెట్టి వాటిని అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మసముద్రంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావుతో కలసి పాల్గొన్నారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సి.ఆర్.రాజన్, మండల పార్టీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ ఎమ్మెల్యే దొరబాబు పాల్గొన్నారు. **బంగారుపాళ్యం, పూతలపట్టు, యాదమరి, జీడీనెల్లూరు, పెనుమూరు:** యాదమరిలో ఎమ్మెల్యే మురళీమోహన్ మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని మండలాల్లో తెదేపా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కరపత్రాలు అందజేశారు. స్టిక్కర్లు అతికించారు. నగరి మండలంలోని బుగ్గఅగ్రహారంలో మంగళవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.


ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం


కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉభయదారులు


వినాయకుడికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కేశవులు, కుటుంబ సభ్యులు, నృత్య ప్రదర్శనలు



శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం

కాణిపాకం, న్యూస్‌టుడే: చంద్రప్రభ వాహన సేవ సందర్భంగా ఉభయదారులు తెల్లవారుజామున స్వామివారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం మంగళవారం ఉదయం నిర్వహించారు. క్షీర కలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అభిషేకానంతరం ఉత్సవమూర్తులకు పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రప్రభ వాహనసేవ సందర్భంగా భక్తుల కాలక్షేపం కొరకు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టువస్త్రాలు సమర్పణ..: ప్రత్యేకోత్సవాల సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ విశ్రాంత అదనపు కమిషనర్, అగరంపల్లెకు చెందిన జి.కేశవులు కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు మంగళవారం ఉదయం సమర్పించారు. పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ఈవో గురుప్రసాద్‌కు అందించారు.


నగరిలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


జీడీనెల్లూరు: అక్కనగారిపల్లె వేరుసెనగ పొలంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏవో భవానీ

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

నగరి, న్యూస్‌టుడే, చిత్తూరు గ్రామీణ: వ్యసాయానికి సాంకేతికత జోడించి రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని నగరి, చిత్తూరు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, గురజాన జగన్మోహన్ అన్నారు. నగరిలో భానుప్రకాష్, చిత్తూరు గ్రామీణ మండలం తాళంబేడులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయాధికారులు సౌభాగ్యలక్ష్మి, రమేష్‌రాజు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అన్ని మండలాల్లోనూ ఏవోలు కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.


తెల్లగుండ్లపల్లెలో.. మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి



కార్వేటినగరంలో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ పీవో కృష్ణకిషోర్

సేవాగుణం అలవర్చుకోవాలి

న్యూస్‌టుడే, బృందం: విద్యార్థి దశ నుంచే పిల్లలు సేవా గుణం అలవర్చుకోవాలని వక్తలు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నగరి, పెనుమూరు, గుడిపాల, పుత్తూరు, కార్వేటినగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలలో నిర్వహించారు.

అవీ..ఇవీ..అన్నీ..

వర్షాలకు నేలకూలిన వృక్షం.. చిత్తూరు నగరం: నగరంలో మంగళవారం కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగునీటి కాలువలు పొంగి రోడ్లపైకి వచ్చాయి. పలు ప్రాంతాల్లో చిన్నపాటి వృక్షాలు నేలకూలాయి. రామనగరకాలనీలని ఆర్టీసీ ఒకటో డిపో ఎదుట ఓ భారీ వృక్షం విద్యుత్‌తీగలపై పడటంతో..వాహనాలు దెబ్బతిన్నాయి.

వాహనాల షెడ్డు తనిఖీ.. చిత్తూరు నగరం: స్థానిక నగరపాలక కార్యాలయ సమీపంలోని వాహనాల షెడ్డును కమిషనర్ నరసింహ ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. పెట్రోలు, డీజిల్ వినియోగంపై ఆరాతీశారు. మరమ్మతులకు గురైన వాహనాలను సకాలంలో వినియోగించుకునేలా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం.. వడమాలపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఒకేషనల్ కోర్సుల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ చంద్రమ్మ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. పదవీ విరమణ చేసిన వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ.. పుత్తూరు: కార్వేటినగరం మండలం పరిపత్తు పాఠశాల విద్యార్థులకు రమేష్‌పురోహిత్, ధనలక్ష్మి దంపతులు సుమారు రూ.15వేల విలువైన విద్యా సామగ్రిని మంగళవారం వితరణగా అందజేశారు.

మంత్రికి వినతి.. చిత్తూరు (వైద్యవిభాగం): విజయవాడలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు కలసి, న్యాయమైన కోర్కెలను తీర్చాలని విన్నవించారు. రాష్ట్ర ఉద్యోగులు విజయకుమార్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, రాజేష్, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు పట్టణాభివృద్ధికి సహకరించండి.. పుత్తూరు: పట్టణాభివృద్ధికి సహకరించాలని పట్టణ తెదేపా అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను కలిసి మంగళవారం సన్మానించారు. దసపాల్, కౌన్సిలర్ కేశవచార్య పాల్గొన్నారు.

అన్నదానం.. గుడిపాల: మండల కేంద్రంలో ప్రారంభించిన ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ 457 రోజులు దిగ్విజయంగా కొనసాగుతోంది. మంగళవారం తనవోడైన చంద్రశేఖర్ రెడ్డి మనుమడు దిన తండ్రి వాసుదేవ రెడ్డి వర్ధంతి సందర్భంగా అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందించారు. మండల పార్టీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

పార్థసారథినాయుడుకు సత్కారం.. చిత్తూరు(సంతపేట): లయన్స్ క్లబ్ డైరెక్టర్ పార్థసారథినాయుడు సేవలు స్ఫూర్తిదాయకమని చిత్తూరు హరివిల్లు లలిత కళావేదిక సభ్యులు కొనియాడారు. స్థానిక తపోవనం ఆశ్రమ పాఠశాలలో జరిగిన 'జీవిత సత్యాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యక్రమాల్ని చేపడుతోన్న పార్థసారథినాయుడుని కళావేదిక తరపున సన్మానించారు. కళావేదిక ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, మునస్వామి తదితరులు ఉన్నారు.

సంతకాల సేకరణ.. నగరి: జనసేన ఆధ్వర్యంలో సనాతన ధర్మ రక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరిలో జనసేన, తెదేపా నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నగరి శ్రీకరియమాణిక్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రదర్శనగా నగరి టవర్ క్లాక్ వరకు వెళ్లారు.

మహిళలకు శిక్షణ.. పుత్తూరు: మహిళలు చేతివృత్తుల్లో శిక్షణ పొందడం ద్వారా ఎంతో లబ్ధి ఉంటుందని జన్‌శిక్షణ్ సంస్థాన్ అధికారి హరి పేర్కొన్నారు. పుత్తూరు రాస్ కార్యాలయంలో రాస్-జేఎస్ఎస్ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సును మంగళవారం ప్రారంభించారు. రవి, దివాకర్, శేఖర్, ప్రకాష్, భువన, జయంతి పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం.. జీడీనెల్లూరు: జీవిత బీమా ఉన్నా రోడ్డుప్రమాదంలో భర్తతోపాటు కుమార్తెను కోల్పోయిన బాలగంగనపల్లెకు చెందిన జనేత అనే మహిళకు మంగళవారం తెదేపా యువనేత యువరాజారెడ్డి తన సొంత నిధులు రూ.30వేలు అందజేశారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి.. తవణంపల్లె: కట్టకిందపల్లె పంచాయతీ విజయనగరం ఎస్టీ కాలనీ వాసులకు శ్మశానానికి కనీసం ఎకరం స్థలం కేటాయించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు. శ్మశానానికి స్థలం కావాలని జిల్లా అధికారులకు వినతి పత్రం అందించగా మంగళవారం కలెక్టర్ సమీపంలో రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

రాళ్లు తీస్తామని చికిత్స చేస్తే కేసులు

పాలసముద్రం, న్యూస్‌టుడే: కిడ్నీలో రాళ్లను వెన్న పూసే చికిత్స చేసి రాళ్లు తీస్తామని చికిత్సలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పై భారతి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమెడల పంచాయతీలో కిడ్నీలో రాళ్లు తీస్తామని వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులపై దాడులు నిర్వహించి అవగాహన కల్పించారు. వైద్యం చేస్తున్నట్లు సమాచారం అందితే తప్పనిసరిగా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

దిగుబడి పడిపోయి.. రైతుల దిగాలు

☛ వేరుసెనగ సాగులో నష్టం ☛ పెట్టుబడులు దక్కక నైరాశ్యం

పెనుమూరు, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణంగా రైతులు ఎక్కువగా వేరుసెనగ పంటను సాగుచేస్తారు. ఈ పంటను చాలా వరకు మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంపై ఆధారపడి పండిస్తుంటారు. జిల్లాలో సాగు విస్తీర్ణం 43,174 హెక్టార్లు కాగా ఈ ఏడాది 13,612 హెక్టార్లలో మాత్రమే సాగుచేశారు. రైతులు వేరుసెనగ విత్తనాలు విత్తినప్పటి నుంచి వరుణుడు ముఖం చాటేశాడు. కాయలు ఏర్పడే సమయంలో పంట ఎండుముఖం పట్టింది.

తగ్గిన దిగుబడి..: ఖరీఫ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వేరుసెనగ పంటలో చాలా వరకు దిగుబడి తగ్గింది. వర్షాలు కురిసి మంచి దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు చివరకు నిరాశే మిగులుతోంది. సాధారణ దిగుబడి వస్తే ఎకరాకు 15 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితిలో మూడు బస్తాలు కూడ రాని పరిస్థితి ఉంది. దీంతో రైతులు భవిష్యత్తులో వేరుసెనగ సాగు పట్ల ఆసక్తి కోల్పోయే అవకాశం కనిపిస్తోంది.


వేరుసెనగ పంటను తొలగిస్తున్న దృశ్యం


రైతులు తొలగించిన పంట



ఈ చిత్రంలో వేరుసెనగ కంకులు చూపుతున్న రైతు పేరు నాగరాజరెడ్డి. పెనుమూరు మండలం కావూరివారి పల్లె పంచాయతీ కొత్తరోడ్డు ఇండ్లు గ్రామం. 1.25 ఎకరాలో వేరుసెనగ వేశారు. ఇందుకు సుమారు రూ.25 వేలుకు పెట్టుబడి పెట్టారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంట కనీసం 25 శాతం దిగుబడి రాలేదని వాపోయాడు. కనీసం రూ.3 వేలు కూడ రాదని అన్నారు. వేరుసెనగ చెట్లు పశుగ్రాసంగానైనా ఉపయోగపడుతుందన్న ఆశతో పంట నూర్పిడి చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ పరిస్థితి ఇతనొక్కడిదే కాదు.. జిల్లాలోని చాలా వరకు రైతులందరిదీ.


ఇన్‌స్పైర్ మనక్ గోడపత్రులు విడుదల చేస్తున్న డీఈవో శేఖర్, డీవైఈవో ప్రభాకర్‌రాజు

ఇన్‌స్పైర్ మనక్‌లో నూతన ఆవిష్కరణలు

పుత్తూరు,న్యూస్‌టుడే: ఇన్‌స్పైర్ మనక్‌తో నూతన ఆవిష్కరణలు వస్తాయని తిరుపతి డీఈవో శేఖర్ పేర్కొన్నారు. పుత్తూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పైర్ మనక్‌పై డివిజన్‌లోని ఉపాధ్యాయులకు డీవైఈవో ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లు 2024-25కు గాను ప్రతి ఉన్నత పాఠశాలల నుంచి 5, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 ప్రాజెక్టులు అక్టోబరు 15వ తేదీలోపు పంపాలన్నారు. ప్రాజెక్టులు ఎంపిక చేసే సమయంలో సృజనాత్మకంగా ఉండాలన్నారు. ఇన్‌స్పైర్ మనక్ జిల్లా అధికారి భానుప్రసాద్ మాట్లాడారు. ఎంఈవోలు తిరుమలరాజు, బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో డ్రైవర్ ఆత్మహత్య

బంగారుపాళ్యం: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకొన్న ఘటన మండలంలోని పాలేరులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చలపతి (33) ఓ ప్రైవేటు పాఠశాల వ్యాను డ్రైవరుగా పనిచేస్తున్నారు. కొన్ని రోజులుగా కుటుంబ కలహాలతో ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం పైకప్పుకు అమర్చిన ఇనుప రాడ్డుకు చీరతో ఉరేసుకున్నాడు. ఇతనికి భార్య పద్మజ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

నియంత్రికల్లో రాగి తీగల చోరీ

ఐరాల, న్యూస్‌టుడే: కొండేపల్లె పరిసర గ్రామాల్లో సోమవారం రాత్రి విద్యుత్ నియంత్రికలను పగులగొట్టి అందులోని రాగి తీగలను దొంగలు చోరీ చేశారు. ఆ గ్రామ పరిసరాల్లో ఐదు విద్యుత్ నియంత్రికల్లో రాగితీగలు చోరీ చేయడంతో సంబంధిత శాఖకు దాదాపు రూ.1.50లక్షల మేరకు నష్టం వాటిల్లింది. మంగళవారం విద్యుత్ శాఖాధికారులు ఆ నియంత్రికలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నారు.



పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

510 మందికి వైద్య పరీక్షలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణానికి సమీపంలోని పద్మావతి బాలికల కళాశాల ఆవరణలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 510 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేపట్టినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కె.ఆర్.శంకర్ తెలిపారు. మంగళవారం పలమనేరు లయన్స్ సర్వీసు కేంద్రం, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల, చిత్తూరు జిల్లా మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా వైద్యశిబిరాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 25 మందిని కంటి పరీక్షల కోసం, 75 మందిని వివిధ రకాల ఆరోగ్య, పరీక్షలు ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు రవి, పుగలేంది, చంద్రయ్యశెట్టి, సత్యనారాయణశెట్టి, దివాకర్, శ్రీరాములుశెట్టి, రాజప్పశెట్టి, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డి పరామర్శ

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన వైకాపా నాయకుడు జయచంద్రారెడ్డి తల్లి రంగమ్మ(85) వారం క్రితం ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం ముప్పిరెడ్డిగారిపల్లెకు విచ్చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైకాపా నాయకుడు జయచంద్రారెడ్డి కుటుంబీకులను పరామర్శించారు.

పారిశుద్ధ్య చర్యలు

స్పందనకు వందనం

పుంగనూరు గ్రామీణ: మండలంలోని ఏటవాకిలి గ్రామం ఎస్సీ కాలనీ సమీపంలో గల నీటి కుళాయి వద్ద నిలిచిన మురుగును కార్మికులు తొలగించారు. ఈ నెల 21న 'మేమున్నాం.. మీకు తోడుగా'కు వచ్చిన సమస్యకు స్పందించిన పంచాయతీ సహాయకుడు హేమాద్రి పరిష్కరించారు. **గుడుపల్లెలో..** మండల కేంద్రం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పేరుకుపోయిన చెత్త కుప్పలను మంగళవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈనెల 22న 'మేమున్నాం.. మీకుతోడుగా' శీర్షికన వచ్చిన వార్తకు పంచాయతీ కార్యదర్శి అజూహర్‌బాషా స్పందించి పనులు చేయించారు.

ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం



కీలపట్లలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, న్యూస్‌టుడే: రైతులకు సమస్యగా మారిన ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తున్నామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కీలపట్ల పంచాయతీ పరిధిలో నలసానపల్లె, కురప్పల్లె, మాదిగపల్లె, జరవారిపల్లె, కీలపట్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కీలపట్లలో జరిగిన ప్రజావేదిక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సర్పంచ్ చంద్రశేఖర్, తెదేపా నాయకులు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, జనసేన పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. పురపాలిక పరిధిలోని 15వ వార్డులో మంగళవారం సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు, తెదేపా మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఉన్నారు. **కుప్పం గ్రామీణ, :** మండల పరిధి అడవిములకలపల్లి గ్రామానికి మంగళవారం నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ బస్సు కుప్పం నుంచి బయలుదేరి బిరదనపల్లి, నడుమూరు, పైపాళ్యం మీదుగా అడవిములకలపల్లికి చేరుకుంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న మునిరత్నం, కమిషనర్ శ్రీనివాసరావు

చెరువు దున్నేయ్.. పాగా వేసెయ్

* కడపనత్తంలో చెలరేగుతున్న ఆక్రమణదారులు
* మట్టి తవ్వి సాగు.. ఆందోళనలో ఆయకట్టు రైతులు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఆయకట్టుకు నీరందించే చెరువునే దురాక్రమణదారులు చెర పట్టారు. చెరువులో మట్టి తవ్వి దర్జాగా ఆక్రమించేస్తున్నారు. బైరెడ్డిపల్లె మండలంలోని కడపనత్తం పెద్ద చెరువు విస్తీర్ణంలో పెద్దది. ఆక్రమణలతో కుంచించుకుపోయి చిన్నదిగా మారుతోంది. 150 ఎకరాల విస్తీర్ణం కల్గిన చెరువులో ఇప్పటికే 40 ఎకరాలకు పైగా ఆక్రమణలు జరిగాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానలు కురిసి చెరువు నిండినా ఆయకట్టు భూములకు సాగునీటి కష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. చెరువును పరిరక్షించాలని రైతులు కోరుతున్నారు.

ధరలు పెరగడంతో భూములపై కన్ను

భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరం సాగు భూమి కొనాలంటే రూ. 20-30 లక్షలు వెచ్చించాలి. లక్షలు ఖర్చు చేసినా సాగునీటికి బోరు బావులు తవ్వాలి. నీటి వనరులు లేక ఇబ్బందులు పడాల్సిందే. చెరువును ఆక్రమిస్తే అడిగేవారెవరని భావించారేమో. కడపనత్తం పెద్దచెరువు మూడు వైపులా ఆక్రమణలకు గురైంది. చెరువు నిండినా పొలంలో వేసిన పంటలు మునగకుండా ఆక్రమించిన ప్రాంతాన్ని ఎత్తు పెంచేస్తున్నారు. చెరువులోని మట్టిని జేసీబీలతో తవ్వి తీసి ట్రాక్టర్లతో దిబ్బలుగా పరిచి ఎత్తు చేసుకుని ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఇలా ఆక్రమించిన భూమిలో దర్జాగా పంటలు సాగు చేస్తున్నారు. కొందరు రైతులు చెరువులోనే బోర్లు సైతం వేసి నీటి వనరులను దోపిడీ చేస్తున్నారు. ఇష్టానుసారంగా చెరువును కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.



చెరువు ఆక్రమణకు తోలిన మట్టి దిబ్బలు

మరికొన్ని చోట్ల ఇలా..

బైరెడ్డిపల్లె పెద్దచెరువు, తొరడి చెరువు ఆక్రమణలు అధికంగా ఉన్నాయి. బేలుపల్లె, లక్కనపల్లె, ఆలపల్లె, దేవదొడ్డి, ఎం. కొత్తూరు చెరువుల్లో దాదాపు 150 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నాయి. వీటిని సమీప భూములకు చెందిన వ్యక్తులే ఇలా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నియోజకవర్గంలోని పలమనేరు, వి.కోట, పెద్దపంజాణి మండలాల్లోనూ పదుల సంఖ్యలో చెరువుల్లో ఆక్రమణలున్నాయి.



కడపనత్తం పెద్దచెరువును ఆక్రమించి సాగుభూమిగా ట్రాక్టరుతో దుక్కి చేస్తున్న దృశ్యం

సాగునీటికి తప్పని కష్టాలు

చెరువుల ఆక్రమణతో విస్తీర్ణం తగ్గి రూపు కోల్పోతోంది. కబ్జా చేసి సాగు భూమిగా మార్చేయడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. చెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరితే ఏడాదికి రెండు పంటలు పండేవి. ఆక్రమణతో చెరువు నిండినా ఒక పంటకు నీరు చాలడం లేదని రైతులు వాపోతున్నారు. ఆయకట్టు భూముల్లో పంటలు పండించాలంటే బోరు బావులపై ఆధారపడాల్సి వస్తోంది. చెరువును పరిరక్షిస్తే రైతులు బోరు బావుల తవ్వకానికి లక్షలు ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు.

సర్వే చేసి తొలగిస్తాం.. కడపనత్తం పెద్ద చెరువు ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చాయి. చెరువును పరిశీలించడానికి సర్వేయర్లను పంపించాం. మిలిగిన చెరువుల్లోనూ పరిశీలిస్తాం. సర్వే చేయించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.
- మాధవరాజు, తహసీల్దార్, బైరెడ్డిపల్లె

మిట్టూరులో తీరిన దాహార్తి

గుడుపల్లె, న్యూస్‌టుడే: గుడుపల్లె పంచాయతీ మిట్టూరులో నీటి ఎద్దడిపై గ్రామస్థుల వినతి మేరకు కుప్పం తెదేపా సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్ చొరవ తీసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులతో కొత్తగా మోటారు పంపుసెట్ అమర్చే పనులు మంగళవారం చేపట్టారు. నెలరోజులుగా ప్రజలు ఎదుర్కొంటున్ననీటి సమస్యల నివారణ పట్ల శ్రద్ధ చూపడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరిస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారి రాజశేఖర్

సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచాలి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్ఎస్ఎస్ అధికారి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే ప్రిన్సిపల్ రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పలమనేరు:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని రెండు యూనిట్ల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలను చేపడుతున్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్‌బాబు అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం

కల్లూరు: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని పుంగనూరు తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి చల్లా రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పులిచెర్ల బీసీ కాలనీలో ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అతికించారు. రామనాథంనాయుడు, వెంకటరమణ, జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ , నాయకులు కుమార్‌రెడ్డి, మురళీధర్‌నాయుడు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **సదుం, పుంగనూరు, పెద్దపంజాణి, కుప్పిగానిపల్లె(గుడుపల్లె), రామకుప్పం:** ఆయా కేంద్రాల్లో మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

నూతన పద్ధతులతో సత్ఫలితాలు

న్యూస్‌టుడే, బృందం: వ్యవసాయానికి సాంకేతికత జోడించి సాగులో నూతన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవోలు పేర్కొన్నారు. సేంద్రియ సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అన్ని మండలాల్లో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవోలు ఫయాజ్, జ్యోతి, అపోజీ, నాగరాజు, హరిప్రసాద్, సుధాకర్ కుమార్ పాల్గొన్నారు. ఉద్యాన శాఖ అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తెదేపా నాయకులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.



చౌడేపల్లె: గడ్డంవారిపల్లెలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కల్తీనెయ్యి వినియోగం నేరం

పుంగనూరు, న్యూస్‌టుడే: శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు నెయ్యిలో కలిపి వినియోగించడం నేరమని హిందూ జాగరణ సమితి నాయకులు త్రిమూర్తిరెడ్డి, పరమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలో శ్రీవారి చిత్రపటంతో నిరసన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ప్రపంచ వ్యాప్తంగా గల భక్తులు భక్తిభావంతో తీసుకునే లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించిన, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ కూడలిలో మానవహారం చేశారు. సీఐ శ్రీనివాసులను కలిసి వినతిపత్రం అందించారు. పురవీధులు గోవింద నామస్మరణతో మారుమోగాయి.



ఎన్టీఆర్ కూడలిలో మానవహారం చేపట్టిన హిందూజాగరణ సమితి నాయకులు

కోర్టులో కేసున్నా దౌర్జన్యంగా దున్నేశారు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: కోర్టులో నడుస్తున్న ఉన్న భూమిని అక్రమంగా కొందరు మంగళవారం దున్నేశారని మండలంలో కాటిపేరికి చెందిన హేమంత్ కుమార్ తెలిపారు. కాటిపేరి సర్వే నంబరు 235/4వ నంబరులో 3.69 ఎకరాల విస్తీర్ణం ప్రభుత్వం అవ్వ లక్ష్మమ్మ పేరుతో డీకేటీ పట్టా ఇచ్చిందని దానిని మా నాన్నను మోసగించి కొందరు కొనుగోలు చేసుకున్నారని వివరించారు. న్యాయం కోసం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి కేసు వేశామని ప్రస్తుతం విచారణ సాగుతుండగా ఇంటి దగ్గర ఎవ్వరు లేని సమయంలో హెచ్చరిక బోర్డులు తొలగించి దున్నేశారని వాపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు.

యువత సేవాభావం అలవర్చుకోవాలి

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: యువత దేశ రక్షణ కోసం పాటుపడాలని వీసీ ఆచార్య దొరస్వామి పేర్కొన్నారు. వర్సిటీ ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 35 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ ఏడాది కొత్తగా 60 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించినట్లు ఆయన తెలిపారు. రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, చిత్తూరు 35 బెటాలియన్ కమాండింగ్ అధికారులు, వర్సిటీ ఎన్‌సీసీ విభాగం ఇంఛార్జి శ్రీప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు. వాలంటీర్లు మొక్కలు నాటారు. కర్ణాటక నాటక అకాడమీలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఉద్యోగి నరసింహ ప్రసాద్ ప్రతిభ కనబరిచి కర్ణాటక ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్నారు. అతన్ని సత్కరించారు.



ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో ఆచార్య దొరస్వామి తదితరులు

జనసేన ప్రాయశ్చిత్త హోమం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలలో స్వామివారి ప్రసాదం విషయంలో గత వైకాపా ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఆ పార్టీ నాయకులు కుప్పంలో హోమాలు నిర్వహించారు. కుప్పం గ్రామదేవత శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయంలో ఘృత మిశ్రమ మోదక నివేదన భక్షణ దోష ప్రాయశ్చిత హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జనసేన కన్వీనర్ నరేష్, నాయకులు నవనీత, విజయలక్ష్మీ, కస్తూరి, నాయకులు పాల్గొన్నారు.



గంగమ్మ దేవాలయంలో హోమాలు నిర్వహిస్తున్న జనసేన నాయకులు

సేవ జీవితంలో భాగం కావాలి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సేవను అలవర్చుకోవాలని, జీవితంలో సామాజిక సేవ భాగం కావాలని బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ నాగరాజ్ అన్నారు. స్థానిక కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపల్ డా.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, ఎన్ఎస్ఎస్ అధికారి మాధవన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.



మొక్కలు నాటుతున్న బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ నాగరాజ్, కేఈసీ ప్రిన్సిపల్ డా.సుధాకర్‌బాబు

నేర్చుకుని, నేర్పించాలి: డీఈవో

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మారిన పాఠ్యాంశాల దృష్ట్యా ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకుని, పిల్లలకు నేర్పించాలని డీఈవో దేవరాజు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతగా మెను ప్రకారం తయారు చేయాలని వంట ఏజెన్సీకి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అదే విధంగా ఉపాధ్యాయుల బోధన పనితీరును ప్రశ్నించారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, సీఆర్పీలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో దేవరాజు

రాయితీ డ్రిప్ పరికరాల పంపిణీ

బైరెడ్డిపల్లె, సోమల న్యూస్‌టుడే: ఐదేళ్లుగా డ్రిప్ పరికరాల కోసం అవస్థలు పడిన రైతుల కష్టాలు కూటమి ప్రభుత్వంలో తీరాయని డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు అతి త్వరగా పరికరాలు అందజేస్తున్నట్లు వీహెచ్‌ఏ సునీల్ అన్నారు. నెల్లిపట్లలో మంగళవారం రైతు వేణుగోపాల్‌రెడ్డికి భూమి డ్రిప్ కంపెనీ ప్రతినిధులు రాయితీ డ్రిప్ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌సీవో అశోక్, భూమి డ్రిప్ కంపెనీ ప్రతినిధి నాగరాజు, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అవీ ఇవీ అన్నీ

నాయీబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి.. పలమనేరు: అన్యకులస్థులు సెలూన్లు నడపడంతో నాయీబ్రాహ్మణులు జీవనోపాధి కోల్పోతున్నారని సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసల రవి అన్నారు. మంగళవారం పట్టణంలోని నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు ఆమేరకు వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎన్వీరమణారెడ్డికి సమర్పించారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి.. బైరెడ్డిపల్లె: గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనివ్వడానికి సాధ్యమని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రమాదేవి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా కడపనత్తం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అవశ్యకత గురించి అవగాహన కల్పించారు. గ్రామ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. గర్భిణులకు సీమంతం చేసి పోషకాహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెదేపా నేత మృతికి సంతాపం.. బైరెడ్డిపల్లె: తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు పినతండ్రి శీనప్పగౌడు(75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఆయన సతీమణి రేణుకారెడ్డి, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ రెడ్డెప్ప, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, పలువురు తెదేపా నాయకులు శీనప్పగౌడు భౌతికకాయం వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలి.. బైరెడ్డిపల్లె: పాడి రైతులు ఆవులకు గాలి కుంటువ్యాధి టీకాలు తప్పక వేయించుకోవాలని పశుసంవర్థకశాఖాధికారి వెంకటసాయి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం బేలుపల్లె, కమ్మనపల్లె గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా భూసార పరీక్ష కేంద్రం ఏవో భారతి, ఏవో గీతాకుమారి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కుప్పం సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం.. శాంతిపురం: కుప్పం సమగ్రాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు ప్రాధాన్యతను ఇస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంకేపురం, మఠం, కోనేరుకుప్పం, అనికెర, రేగడదిన్నెపల్లె పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభలను మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం.. కుప్పం పట్టణం: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం మండలం విద్యాశాఖ అధికారి-2 రాజారామ్ ప్రారంభించారు. అండర్ 14,17 బాలబాలికలకు అథ్లెటిక్స్ ,యోగ, చెస్, బాడ్మింటన్ నిర్వహించారు. క్రీడా పోటీల్లో 600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాడ్మింటన్ అధ్యక్షుడు మహేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రామకుప్పం:** మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని తెదేపా మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి అన్నారు. మంగళవారం డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అండర్ బాల బాలికల ఆటల పోటీలను ప్రారంభించారు.

సేవామూర్తి మదర్ థెరిసాను స్మరించుకుందాం.. కల్లూరు: తోటివారికి సాయం చేయడానికి తన వ్యక్తిగత జీవితాన్నే త్యజించిన మహనీయురాలు మదర్‌థెరిసా అని ఎల్లంకివారిపల్లె జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తులసీరామ్, ఎన్ఎన్ఎస్ ప్రోగ్రామ్ అధికారి సురేష్ తెలిపారు. మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో ఆవరణాన్ని శుభ్రం చేశారు. అంతకు ముందు విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీని నిర్వహించారు.

క్రమశిక్షణతో భవిత..


ఎన్‌సీసీలో ప్రతిభ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుంది. క్రమశిక్షణకు మారుపేరైన ఎన్‌సీసీని పాఠశాల స్థాయి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం ద్వారా భవిష్యత్తు తరాలను ప్రయోజకులుగా తయారు చేయవచ్చు. పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ 1999లో ప్రారంభించగా ఇప్పటి వరకు 151 మంది ఎన్‌సీసీలో శిక్షణ పొంది 2024లో పలువురు 'సీ ధ్రువ పత్రానికి' ఎంపికయ్యారు. తిరుపతిలో (సీఏటీసీ) కమాండ్ ఆన్యువల్ ట్రెయినింగ్ క్యాంపులు, చిత్తూరులో (ఏటీసీ) ఆన్యువల్ శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొంది బంగారు పతకాలు, సీ సర్టిఫికేట్ సాధించారు. విద్యార్థులు కఠోర శిక్షణతో సీ ధ్రువపత్రాల కోసం జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణులై కళాశాల పేరు నిలబెట్టారని ప్రిన్సిపల్ రాజశేఖర్, ఎన్‌సీసీ అధికారి సోమరాజు అన్నారు.



జాతీయ పతాకం చేతపట్టిన ఎన్‌సీసీ విద్యార్థులు


ఆర్మీలో చేరడమే లక్ష్యం.. సీ ధ్రువ పత్రానికి ఎంపిక కావడం పట్ల ఎంతో ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు దినసరి కూలీలుగా కష్టపడి చదివించారు. వారికి గుర్తింపు తీసుకువస్తా. ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణతో పాటు అంకిత భావం పెరిగింది. భారత సైన్యంలో చేరి దేశానికి నా వంతు సేవలు అందించాలన్నదే లక్ష్యం.
-హేమలత, హనుమతురాయిదిన్నె




ఎస్సై కావడమే ధ్యేయం.. నేను శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ బీకాం చదువుతున్నా. ఎన్‌సీసీ ద్వారా కఠోర శిక్షణ పొంది ఏ, బీ ధ్రువ పత్రాలతో పాటు బంగారు పతకాన్ని సాధించా. 2024లో నిర్వహించిన వివిధ పరీక్షల్లో విజయం సాధించి 'సీ ధ్రువపత్రం'కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. పోలీసు శాఖలో ఎస్సైగా చేరి ప్రజలకు మెరుగైన సేవ అందిస్తా.
-భార్గవి, మేలుపట్ల



నిబద్ధత అలవరుచుకున్నా.. ఎన్‌సీసీలో చేరిన తరువాత క్రమశిక్షణ, నిబద్ధత అలవరచుకున్నా. సమాజంపై అవగాహన, బాధ్యత పెరిగింది. ఆర్మీ ట్రైనింగ్ క్యాంపుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మనోధైర్యం పెరిగింది. సీ సర్టిఫికెట్ సాధించడంతో ఉన్నత శిఖరాలకు చేరినంత ఆనందంగా ఉంది.
-పవన్, కట్టకిందపాళ్యం



డిఫెన్స్ కంబైన్‌డ్ సర్వీసెస్‌కు శిక్షణ పొందుతున్నా.. సీ సర్టిఫికేట్ సాధించడంతో ఆత్మ విశ్వాసం పెరిగింది. ఇదే స్ఫూర్తితో డిఫెన్స్ కంబైన్‌డ్ సర్వీసెస్‌కు శిక్షణ పొందుతున్నా. ఎన్‌సీసీలో చురుకుగా పాల్గొని అధికారుల ప్రశంసలు అందుకుని ప్రణాళిక ప్రకారం ముందు కెళుతున్నా.
-జశ్వంత్, పుంగనూరు



బస్సు టెంపో ఢీ.. ఇద్దరికి గాయాలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బంగారుపాళ్యం నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేట్ బస్సు మదనపల్లి నుంచి పుంగనూరుకు వస్తున్న బొలెరో సుగాలమిట్ట మలుపు రోడ్డుపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. పుంగనూరుకు చెందిన బొలెరో డ్రైవర్ కృష్ణమూర్తి (32), తిరుపతికి చెందిన బస్సు డ్రైవర్ కృష్ణయ్య(56)కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. కృష్ణమూర్తికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించి, కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనం బోల్తాలో ఒకరికి..

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని మాగాండ్లపల్లె పంచాయతీ బరిణేపల్లె గ్రామానికి చెందిన మునివెంకటప్ప కుమారుడు శంకరప్ప మంగళవారం పుంగనూరుకు వెళుతుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శంకరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

వ్యక్తికి జైలు, జరిమానా

గుడుపల్లె, న్యూస్‌టుడే: మద్యం సేవించి ద్విచక్రవాహనం నడిపి పట్టుబడిన కేసులో మురుగప్ప అనే వ్యక్తికి మంగళవారం రెండు రోజులు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై డి.శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 22న వాహనాల తనిఖీలో భాగంగా మండల పరిధి అగరం గ్రామానికి చెందిన మురుగప్ప మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసి కుప్పం కోర్టు జూనియర్ రెండో తరగతి న్యాయమూర్తి ముందు హాజరు పరచగా అతనికి జైలు, జరిమానా విధించినట్లు వివరించారు.

యువకునికి దేహశుద్ధి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకునికి కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసిన సంఘటన సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని బోడేవారిపల్లె పంచాయతీ అక్కింవారిపల్లె గ్రామానికి చెందిన క్రిష్ణప్ప కుమారుడు విజయభాస్కర్‌రెడ్డి(39) వారం రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ (17) బాలికను పిలుచుకుని వెళ్లాడు. కుటుంబసభ్యులు చుట్టు పక్కల వెతకగా మదనపల్లెలో ఉన్నట్లు గుర్తించి బాలికను ఇంటికి తీసుకువెళ్లి, ఇంకోసారి మా బిడ్డ జోలికి వస్తే బాగుండదని విజయభాస్కర్‌రెడ్డిని మందలించారు. ఫోన్‌లో ఉన్న ఆనవాళ్లను ఇవ్వాలని కోరగా నిందితుడు ఎదురుదాడి చేయడంతో బాలిక కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేయడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడికి సంబంధించి నిందితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పరిశీలించి కేసు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.